సామర్థ్యాన్ని పెంపొందించడంలో వార్తాపత్రికలు ప్రధాన భూమికను పోషించాయి. వార్తాపత్రికల ప్రచురణ కాలం గడుస్తున్నకొద్దీ లాభార్జనకు పూనుకుంటున్నప్పటికీ ప్రజాభిప్రాయం రూపొందించే సాధనాలుగా వార్తాపత్రికల పాత్రను విస్మరించరాదు.

ఇక విదేశీ ప్రచురణలు మన దేశానికి వస్తే వాటికి మన దేశ సమైక్యతా పరిరక్షణకై ఏ విధమైన నిబద్ధత వుంటుంది? మన దేశంలో అలజడులు సృష్టించడానికి అవి తమ పత్రికలను ఉపయోగించగలవని ఎవరు భరోసా యివ్వగలరు? భారతదేశంలో తమకంటూ స్వంత ఎజెండా వుండదని, బడా వ్యాపారస్తుల ప్రయోజనాలను కాపాడేందుకు పాటుపడరని నమ్మకం ఏమిటి?

మిగతా ప్రపంచానికంతటికీ భారతదేశం ద్వారాలు తెరిచిన ప్రస్తుత తరుణంలో ఆర్థిక సరళీకరణ ప్రక్రియ క్రింద విదేశీ పత్రికలను అనుమతించడంకంటే మరింత విశాలమైన ప్రయోజనాల దృష్టికోణంలో విదేశీ పత్రికల ప్రవేశం గురించి అధ్యయనం చేయవలసివుంది. ఒకవేళ పత్రికా రంగాన్ని కూడా పరిశ్రమగా చూసినట్లైతే విదేశీయులకు అందుబాటులో వుందని రక్షణ, అణుశక్తి రంగాలతో సమానంగా కీలకమైన పరిశ్రమగా పత్రికలను పరిగణించాలి. మనం కూడా యితర ప్రపంచంతో పాటు నడవాలనే విధానాన్ని అవలంబిస్తూనే, ముద్రణారంగం గురించి మనం జాగ్రత్తగా వ్యవహరించవలసి వుంది. తప్పుడు సమాచారాన్ని అందించడానికి విదేశీయులు వార్తాపత్రికలను ఉపయోగించుకోవచ్చు. ప్రాంతీయ భాషా పత్రికారంగంలోకి వారు అడుగిడటాన్ని ఎవరు అడ్డుకోగలరు?

ఉత్పత్తి ప్రాతిపదిక సౌకర్యాలుగల రంగాలకు విదేశీ పెట్టుబడులను మళ్లించడమే ప్రభుత్వ విధానంగా వుంది. మధ్య తరగతి వారిని ఆకర్షించడం ద్వారా భారతదేశ మార్కెట్‌ను దోచుకోవడానికి అనేక విదేశీ కంపెనీలు అమితాసక్తిని చూపాయి. అనేక వార్తాపత్రికలకు అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుంది. అంతర్జాతీయ మార్కెట్లో లభించేది మన దేశీయుల వద్ద కూడా వుంది. విదేశీ పత్రికలను ప్రోత్సహించడం వల్ల మనకు సాంకేతిక పరిజ్ఞానంగాని, పెట్టుబడిగాని లభించదు. విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి కూడా యిది ఏ మాత్రం ఉపకరించదు.

న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు, చట్ట సభలు ప్రజాస్వామ్యానికి మూడు మూలస్తంభాలు కాగా, పత్రికలు నాల్గవ మూల స్తంభం. భారత ప్రజాస్వామ్యానికి తాము సంరక్షకులమని మన పత్రికలు సమర్థవంతంగా నిరూపించుకున్నాయి.

విదేశీయులను పార్లమెంటు సభ్యులుగా, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా భారతదేశం హర్షించడం అసాధ్యం. మన విద్యా వ్యవస్థను విదేశీయులు నిర్దేశించడం, నిర్ణయించడం గురించి ఊహించుకోవడం కూడా కష్టమే. అదే విధంగా పత్రికా రంగంలో విదేశీ యాజమాన్యం, ఆధిపత్యం అవాంఛనీయం. ఆందోళన కల్గించే విషయం.

విదేశీ ప్రచురణ కంపెనీల మూలధనంలో భారతీయులదే మెజార్టీ వాటా వుండాలన్న యోచన కూడా సరైంది కాదు. మనదేశంలో పనిచేస్తున్న పెక్కు బహుళజాతి కంపెనీలు, భారతీయ కంపెనీలు కూడా మొత్తం వాటా మూలధనంలో 50 శాతం కన్నా తక్కువ కల్గివున్న వారి ఆధీనంలో నడుస్తున్నాయి. అటువంటి కంపెనీల్లో తక్కువ వాటాలున్న వారు కూడా పెత్తనం చేయడానికి చేసిన ప్రయత్నాలు కూడా తెల్సినవే.

జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, భారతీయ వార్తాపత్రికల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, సహాయకారిగానే కాక, అతి ముఖ్యమైన సానుకూల వాతావరణాన్ని సృష్టించడానికే 1955-56లో క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం నేడు తారుమారైంది. భారతీయ పత్రికల పరిస్థితులు, స్వరూప స్వభావాలు దారుణంగా విషమించనున్నాయి.

ఈక్విటీ, మేనేజ్‌మెంట్ భాగస్వామ్యం" సూత్రం ఆధారంగా విదేశీ వార్తాపత్రికల, వార్తా మ్యాగజైన్ల ప్రచురణకు తాము ఆమోదించేది లేదని ప్రభుత్వానికి 1993 జూన్ 22వ తేదీన ప్రెస్ కౌన్సిల్ తెలియజేసింది. భారతీయ పత్రికా రంగం రెండు శతాబ్దాల నాటిది. భారత స్వాతంత్ర్య సమరంలో భాగంగానే పత్రికలు తమ స్వాతంత్ర్యాన్ని, హక్కులను, స్వేచ్ఛను సిద్ధించుకున్నాయి. వాటిని కాపాడుకోవాల్సి వుంది. ఆ కారణంగా ఈ సమస్యను లోతుగా పరిశీలించవలసిందిగాను, విదేశీ పత్రికలను ప్రవేశపెట్టడానికి ఎటువంటి ప్రయత్నాన్నైనా అడ్డుకోవాల్సిందిగా ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ విజ్ఞప్తి చేస్తోంది.



ఈ వారం కథ

సర్కస్ డేరా

నంబూరు దాక్షాయణి

"ఓలమ్మో!....ఎన్ని ఏనుగులో.....భలే భలే పులులు, సింహాలు కూడా ఉండాయి. ఏనుగులు బంతులాడతాయంట....... నిప్పుల్లోంచి సింహాలు దూకుతాయంట.... తనంత పిల్లలు ఒకళ్ళమీద ఒకళ్ళు నిచ్చెనలా ఎక్కుతారంట పడకుండా........ఒక్కసారిచూడనిస్తే.... డేరాకి ఎక్కడన్నా బొక్కలున్నాయేమో దాంట్లోంచి చూస్తే...." సర్కస్ డేరా అక్కడ వేసిన దగ్గర నుంచి 'మాలచ్మి' మనస్సంతా దానిమీదే ఉన్నది. మొన్నవాళ్ళ వాడకి ఒంటెలు, ఏనుగులు, గుర్రాలు ఊరేగింపుగా వచ్చాయంట. మల్లిగాడు, ఎల్లమ్మ, గౌరీ వీళ్ళంతా వెళ్లిచూసొచ్చారంట. అమ్మకి ఆరోజు బాగోకపోతే పెద్ద గేటు మేడ దగ్గరకి వెళ్లి పనిచేసి రమ్మంది. వెళ్ళి వచ్చేసరికి ఆ కబుర్లన్నీ తన నేస్తాలందరూ వర్ణించి వర్ణించి చెపుతుంటే గింజుకుంది తను. ఎప్పుడూ అంతే తన బ్రతుక్కి. ఏదన్నా క్రొత్తది ఊళ్ళోకివస్తే చూడటానికి తనకి కుదరదు. దసరా పండగలకి కూడా ప్రభ బళ్ళవాళ్ళు ఎన్నివేషాలేసుకొని వచ్చారో.......

అప్పుడూ అంతే చిన్నతమ్ముడికోసం హాస్పటాల్లో ఉండాల్సొచ్చింది. ఎప్పటికైనా తను ఇలాంటివి చూడ కలుగుతుందా.

డేరా సందుల్లోంచి చూడటానికి దారులు వెతుకుతోంది 'మాలచ్మి'.

"ఎవరది? ఎవరంటే మాట్లాడరేం? ఎళ్ళండి........ఎళ్ళండి.... ఇటువైపు రాకూడదు. ముందు నుంచి వెళ్ళి టిక్కెట్టు కొనుక్కొని లోపలికెళ్ళి చూడు."

"నాకాడడబ్బులు లేవయ్యా........ కాసేపు ఈ సందుల్లోంచి చూస్తానయ్య..... గౌరీ వాళ్ళందరూ చూసేసారు. నేనొక్కదాన్నే చూడల......... ఒకేఒక్కసారి చూస్తాను. నేనెప్పుడూ ఏమీ చూడలేదు ఇలాంటివి. కొంచెం చూసి ఆనక ఎల్లిపోతానేం......"

పన్నెండేళ్ళ 'మాలచ్చి' మనస్సంతా సర్కస్ మీదే. ఏదో విధంగా బ్రతిమాలి చూసేయాలి. లేకపోతే నిద్రపోతున్నా తనతోటివారు చెప్పిన మాటలే గుర్తుకొస్తున్నాయి.

"ఏం నీకు కాదుచెప్పేది. టిక్కెట్ కొనుక్కుని వెళ్ళు. క్రింద టిక్కెట్టు ఐదు రూపాయలే. ఇంటికెళ్ళి నీ అమ్మనడిగి తెచ్చుకో హాయిగా బెంచీమీద కూర్చుని చూడవచ్చు. ఎళ్ళు... ఎళ్ళు....." విసురుగామీద కొచ్చాడు కాపలా అబ్బాయి.

భయమేసి ఇవతలకి వచ్చింది మాలచ్మి. "ఐదు రూపాయలంట........ అంత డబ్బులు తను ఎప్పుడూ చూడలేదు. అమ్మకాడ ఏడుంటాయి. ఉన్నా సర్కస్ చూడటానికి ఇవ్వమంటే ఇస్తుందా? ఇంట్లోకి గింజలు కొనాలి అంటుంది. .... పెద్ద మేడమ్మగార్ని అడిగితే..... ఎందుకిస్తారు ఊరికే.... పెద్దపాపగారు మళ్ళీ వస్తే బాగుండు.... చానా దూరంలో పెద్ద చదువులు చదువుకుంటున్నారంట....... ఎంత బాగుంటారో...... క్రితంసారి ఎళతా, ఎళతా రెండు రూపాయలు ఇచ్చారు. సర్కస్ ఎళ్ళే లోపల మళ్ళీ వస్తే బాగుండు. పెద్దబాబుగారికి సిగరెట్లు అవీ తెచ్చిస్తే చిల్లరంతా ఉంచేసుకోమంటారు..... ప్చ్ నా ఖర్మ ఆయన ఊరు వెళ్ళారు....." కాళ్ళీడ్చుకుంటూ డేరా ముందు నుంచి వచ్చేసింది 'మాలచ్మి'.

xx xx xx

'తోటకూర.... పాలకూర........ గోంగూర "పెద్దగా అరుచుకుంటూ ఎదురువచ్చింది గౌరి.

"ఇదేంటి గౌరీ, కూరలెప్పటి నుండి అమ్ముతున్నావు?" "నాలుగు రోజుల నుంచే లచ్మీ! అమ్మగారికాడ పని అయిపోయాక పెద్ద మార్కెట్ కాడకెళ్ళి ఆడ పెద్దకట్టలు తీసుకొని చిన్న చిన్న కట్టలు కట్టి కాలనీల్లో తిరిగి అమ్ముతుండా. రోజూ రూపాయి మిగులుతుంది. చాలా రోజులయ్యాక మక్కల సిల్కులంగా కొనుక్కుంటాగా......." గౌరి చెప్పే మిగతా మాటలేమీ వినపడటంలేదు. రోజుకు రూపాయి..... ఐదురోజులు కష్టపడితే తన కోరిక తీరిపోద్ది....... అప్పుడే సర్కస్ చూసేసినట్లు మురిసిపోయింది 'మాలచ్మీ'.

xx xx xx